

టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకం

ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలోని గంగలకుర అగ్రహారం హైస్కూల్ పదో తరగతి విద్యార్థి బొక్కా సత్యశ్రీ సాయిమణికంఠ టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈనెల 25, 26 తేదీలలో విశాఖ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో ఈ పతకాన్ని సాధించినట్లు హెచ్‌ఎం అక్కిరాజు శేషసాయి తెలిపారు. పతకం సాధించిన మణికంఠను, పీడీ ఎ.వెంకటసూర్యమధును సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు విత్తనాల భవానిశంకర్, ఎస్‌ఎంసి ఛైర్మన్ డి.గోవింద, ఉప సర్పంచ్ బి.రాంబాబు, తదితరులు అభినందించారు.


పతకంతో మణికంఠ

హడలెత్తిస్తున్న మొంథా

- నేటి రాత్రి తీరం దాటే అవకాశం
- 120 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - అమలాపురం

మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లాంతటా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మొంథా తుపాన్ ప్రభావంతో సోమవారం ఉదయం 8:30 నుంచి వర్షం నెమ్మదిగా ప్రారంభమై తీవ్రతరం అయింది. మచిలీపట్నం-కాకినాడ మధ్య ప్రాంతంలో ఈనెల 28వ తేదీ మంగళవారం రాత్రి 10.30 గంటలకు తీరాన్ని దాటే అవకాశం ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. తుపాన్ తీరాన్ని దాటే సమయంలో భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులు తీవ్రత ఉధృతంగా ఉండే అవకాశం ఉండటంతో సముద్ర తీర ప్రాంతం వెంబడి 120 పునరావాస కేంద్రాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి, చిన్నారులకు పాలు, ఆరోగ్య భద్రత వంటి వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులు తలమునకలయ్యారు. సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల పరిధిలో ముంపు ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. తుపాన్ ప్రభావం కొత్తపేట, రామచంద్రపురం డివిజన్లలో ఉండే అవకాశాలు ఉన్నాయన్న అంచనాతో ఆయా డివిజన్లలో పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రజలెవరూ బయట సంచరించకుండా ఇళ్లలోనే ఆశ్రయం పొందాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముంపు భారిన పడే ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మొంథా తుపాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి, విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, కలెక్టర్ మహేష్‌కుమార్ సంయుక్తంగా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ సహాయక చర్యల సన్నద్ధత చర్యలపై సమీక్షించి, యంత్రాంగానికి దిశ నిర్దేశం చేశారు. 28వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు భారీ వర్షాలతోపాటు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ ఈదురు గాలులకు కరెంటు స్తంభాలు, భారీ వృక్షాలు కూలిపోయి రహదారులకు అడ్డంగా పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులు వీటి పునరుద్దరణకు ముందుగా ప్రాధాన్యత నివ్వాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, టెలికాం వంటి సేవల అంతరాయాలు లేకుండా ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. తుపాన్, వాయుగుండం వంటి ప్రకృతి విపత్తుల పట్ల ప్రజలకు అవ గాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే తుపాన్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్ అధికారులను నియమించారు. రిలీఫ్ రిస్క్యూ ఆపరేషన్లకు కొరకు అవసరమైతే విపత్తు నిర్వహణ బృందాల సాయం కోరాలని సూచించారు. రోడ్డు కనెక్టివిటీ పవర్ లైన్ కనెక్టివిటీ పై ప్రత్యేక దృష్టి సారించారు. జెసిబిలు, కరెంటు స్తంభాలు (ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ రంపాలు అత్యవసర చర్యలు నిమిత్తం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. సురక్షిత తాగునీరు నిరంతరాయంగా అందేలా ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సన్నద్ధత చర్యలు పూర్తి చేశారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాలలో ఈదురు గాలులు అధికంగా ఉండే అవకాశం ఉండటంతో రెస్క్యూ సహాయక చర్యలకు బోట్లు, లైఫ్ జాకెట్లతో సిద్ధం చేశారు. తుపాన్ తీవ్రతను బట్టి కచ్చా గృహాలు, శిథిలావస్థకు చేరిన గృహాలలో సుమారు 6 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వుంటుందని అంచనాకు అధికారులు వచ్చారు. ముంపు బాధితుల సహాయ సహకారాల నిమిత్తం కంట్రోల్ రూములను 24/7 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.


ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఎగసి పడుతున్న సముద్ర కెరటాలు


మగసానితిప్ప గ్రామస్తులను పడవలో తరలిస్తున్న అధికారులు


కాట్రేనికోన మండలం మగసానితిప్పలో ఒడ్డుకు చేరిన పడవలు


స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న డిఇఒ సలీంబాషా

దేశభక్తిని పెంపొందించేలా చర్యలు

ప్రజాశక్తి - రావులపాలెం

విద్యార్థి దశ నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా కృషి జరగాలని డిఇఒ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ డాక్టర్ షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ మాస్టర్స్ శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి బాల భట ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. పిఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్‌ను బలోపేతం చేసేందుకు సమగ్ర శిక్షా ద్వారా ఏటా నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. దేశ రక్షణలో స్కౌట్ అండ్ గైడ్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ట్రైనింగ్ పొందిన ప్రతి స్కౌట్ టీచర్ క్షేత్ర స్థాయిలో స్కౌట్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ పి.రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 77 మంది స్కౌట్ టీచర్లు ఈ నెల 23 నుంచి ట్రైనింగ్ పొందుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బేసిక్, అడ్వాన్స్ లీడర్ ఆఫ్ కోర్స్ డిఎల్.నారాయణ, బి.శివనాగిరెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల స్కౌట్ అండ్ గైడ్ సెక్రటరీలు జె.రాజ్‌కుమార్, ఎంవివి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బి.కల్పన, ఎంఇఒ బి.శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్‌టిసి డిపోకు చెందిన కండక్టర్ కె. మంగేశ్వరరావుపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలంటూ ధర్నా జరిగింది. సోమవారం స్థానిక డిపో వద్ద ఆర్‌టిసి యూనియన్ల జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో విధి నిర్వహణలో ఉన్న కండక్టర్‌పై దాడి చేసిన తుట్టపు భూషణం, అతని తల్లి తుట్టపు అన్నపూర్ణ, అడ్డాల ఆదినారాయణలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ దాడిలో గాయపడిన కండక్టర్ కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దాడి ఘటనపై అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన దుండ గులను దాడి చేసిన వారిని అరెస్టు చేయలేదన్నారు.


డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ కెఎస్‌పి.రావు, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ విఎల్.నారాయణ, నేషనల్ యూనిటీ అసోసియేషన్ సెక్రటరీ ముత్యాలరావు, వర్కర్స్ యూనియన్ ప్రతినిధి జిఎస్.రాజు, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో నేల వారిన వరి పంట

వర్షాలతో నేలన్నంటిన వరి పంట

ప్రజాశక్తి - రామచంద్రపురం, ఆత్రేయపురం, కొత్తపేట

కె.గంగవరం మండలంలో 857 ఎకరాల్లో వరి పంట నేల వారిందని మండలం వ్యవసాయ అధికారి ఎం.సద్గురుమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మండలం లోని తాళ్లపూడి, మసకపల్లి, దంగేరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రైతులను కలిసి మాట్లాడారు. వర్షం నీటిని ఎప్పటికప్పుడు చేల నుంచి దిగువకు పోయేలా చూడాలన్నారు. అలాగే రామచంద్ర పురం మండలంలో సుమారు 700 ఎకరాల్లో పంట నేల వారిందని మండల వ్యవసాయ అధికారి టివిఆర్.మణిదీప్ తెలిపారు. అలాగే ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో వరి చేలు నీటమునిగాయి. పొలాల్లో నీటిని కాలువలోకి రైతులు మళ్లిస్తున్నారు. అలాగే కొత్తపేట మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం కురిసిన వర్షానికి వరి పంట నీట మునిగింది. తుపాను హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఆత్రేయపురంలో నేలనంటిన వరి పంట

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రామచంద్రపురం తుపాన్ ప్రభావిత ప్రాంతమైన రామచంద్రపురం నియోజకవర్గం కోటిపల్లిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పర్యటించారు. కోటిపల్లి రేవును, మత్స్యకారుల కాలనీలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుష్కర ఘాట్లను, రేవును ఆనుకుని ఉన్న వీధులలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే మాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరిశీలించారు. పెంకుటిల్లులు, పూరి పాకలలో ఉన్నవారు పునరావస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ బి.మృత్యుంజయరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. **సఖినేటిపల్లి** మండలంలోని అంతర్వేది దేవస్థానం, అంతర్వేది పల్లిపాలెంలలో ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ పర్యటించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్య, కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్‌తో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. **రావులపాలెం** స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌ను ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. వసతి గృహం మరమ్మతులు చేపట్టాల్సివున్నట్లు గుర్తించిన ఆయన వసతి గృహంలో ఉన్న విద్యార్థినులను బాలికోన్నత పాఠశాలకు మార్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ బిఎం.ముక్తేశ్వరరావు, ఎంఇఒ ఆర్.నాగకుమార్, ఎస్‌ఐ చంటి, తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, మండల ప్రత్యేక అధికారి, జిల్లా గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మిప్రత్యూష పలు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. బడుగువానిలంకలో పూరి గుడిసెలు, తాత్కాలిక షెడ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. **కపిలేశ్వరపురం** మండపేట రూరల్ సిఐ దొరరాజు, ఎస్‌ఐ హరీష్‌కుమార్, ఇతర అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. **ఉప్పలగుప్తం** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వరి పంటను ఎపిడితోపాటు, వ్యవసాయ శాఖ ఎడి జి.కెనడీ, ఎంపిడిఒ డి.కృప, వ్యవసాయ అధికారి జి.కుమార్‌బాబు, డిటి జి.లలిత, తదితరులు పర్యటించారు. చల్లపల్లి పంచాయతీ వాసాల తిప్ప మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలించారు. **మామిడికుదురు** మండలంలోని పాశర్లపూడి వైనతేయ నదీ తీరాన ఉన్న పల్లవపాలెం, శ్రీరామ్‌పేట, సత్తరువుతోట, తదితర ప్రాంతాలలో పూరి గుడిసెల్లో ఉన్న పలువురిని పంచాయతీ కార్యదర్శి గుత్తుల వాసు ఆధ్వర్యంలో పునరావస కేంద్రాలకు తరలించారు. అలాగే గోగన్నమఠంతో పాటు నదీ తీర గ్రామాలలో తాటాకు ఇళ్లలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపిడిఒ భవాని, డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాస్, కరవాక పంచాయతీ కార్యదర్శి సుమవి, పాశర్లపూడిలంక కార్యదర్శి డి.సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపేట** వానపల్లి గ్రామంలోని సంఘం పాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్‌డిఒ పి.శ్రీకర్ పరిశీలించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ వై.రాంబాబు, ఎంపిడిఒ నరేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. **ఆలమూరు** స్థానిక బొబ్బా జయశ్రీ బాలిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి ఆలమూరు శివారులో నివసిస్తున్న 15 కుటుంబాలను తరలించారు. ఈ కేంద్రంలో ఏర్పాట్లను ఎంపిడిఒ ఎ.రాజు, పంచాయతీ కార్యదర్శి మోక్షంజలి, కూటమి నాయకులు ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, మానేపల్లి శ్రీనివాస్ పర్యవేక్షించారు. **ముమ్మిడివరం** మండలంలోని ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో తహశీల్దార్ టి.సుభాష్, ప్రత్యేక అధికారి గౌతమ్ పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి వసతి, ఆహారం వైద్య సౌకర్యాలను పరిశీలించారు. ఈ పర్యటనలో ఎంపిడిఒ దీక్షితులు, ఎస్‌ఐ ఐ.జ్వాలసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** మండలంలోని రాజానగరం, గచ్చకాయల పోరా, సిరయానం, సముద్రం, నీళ్ల రేవు, పల్లం, బలుసుతిప్ప గ్రామాల్లో ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్‌ఎ దాట్ల బుచ్చిబాబు పర్యటించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ మాధవి, డిఎస్‌పి ప్రసాద్, నాయకులు చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్ పాల్గొన్నారు. మండలంలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన బలుసు తిప్ప శివారు మగసానితిప్పకు చెందిన 80 మందిని తుపాన్ షెల్టర్ భవనంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రానికి తరలించారు. మండల వ్యాప్తంగా 26 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ రవికిరణ్ తెలిపారు. **అంబాజీపేట** మండలంలోని వక్కలంక, మాచవరం, నందంపూడి, తొండవరం గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాలను కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, తహశీల్దార్ చినబాబు, ఎంపిడిఒ బి.మమత, ఎంఇఒ లు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. **పి.గన్నవరం** మండలంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలు పునరావస కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ప్రత్యేకాధికారి జయచంద్ర గాంధీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో పర్యటిస్తున్న మంత్రి సుభాష్



కాట్రేనికోన మండలంలో పర్యటించిన ఎంపి హరీష్, ఎంఎల్‌ఎ దాట్ల


సఖినేటిపల్లిలో పర్యటించిన ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్


కపిలేశ్వరపురంలో ప్రజలతో మాట్లాడుతున్న సిఐ దొరరాజు


పి.గన్నవరంలో పునరావస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీకర్

కార్టూ'నిజం'



మందులపై పన్ను రద్దు

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రజా సమస్యలపై అధికారులకు అవగాహన, చిత్తశుద్ధి లేకపోవడమే అభివృద్ధికి అడ్డంకిగా మారిందని కౌన్సిల్ సభ్యులు విమర్శించారు. నగర పంచాయతీ పాలకవర్గం సమావేశం సోమవారం కౌన్సిల్ హాల్లో ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. తొలుత 14 అంశాలతో కూడిన అజెండా, 3 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలోనే 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ టౌన్ ప్లానింగ్ విభాగంపై విరుచుకుపడ్డారు. అక్రమ కట్టడాలు, వెంచర్లపై గత సమావేశాల్లో సభ్యులంతా కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవాలని నిలదీశారు. దీనిపై అముడా అధికారులకు, వుడా అధికారులకు నోట్ పెడతామని చెప్పడాన్ని సభ్యులు తప్పుపట్టారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరించకపోతే కార్యాలయానికి తాళాలు వేసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. మార్కెట్ ఏరియాలో మందబయలు ప్రాంతంలో అనేక ఆక్రమణలు ఉన్నాయని, కానీ కుట్రపూరితంగా ఒకే బడ్డీని ఎలా తొలగించారని ఆయన కమిషనర్‌ను నిలదీశారు. స్థానికుల ఫిర్యాదుతోపాటు, ఎంఎల్‌ఎ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో తొలగించామని కమిషనర్ వివరణ ఇచ్చారు. ఇరిగేషన్ డ్రెయిన్‌పై ఆక్రమణలు తొలగించాలని కౌన్సిల్ సమావేశంలోనే ఫిర్యాదు చేసేనా చర్యలు తీసుకోలేదని, ఎంఎల్‌ఎ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తే బడ్డీని తొలగించేస్తారా? అని ప్రశ్నించారు. 5వ వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ స్పందిస్తూ మార్కెట్ ఏరియాలో కొంతమంది తమకు ఇబ్బంది ఉందని ఎంఎల్‌ఎ, ఎంపికి మొరపెట్టుకున్నారని, బాధితుల పిర్యాదు మేరకే బడ్డీని తొలగించడం జరిగిందన్నారు. అలాగే గత కౌన్సిల్ సమావేశంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తూ విధులకు గైర్హాజరైన కాశి బలయోగిని తొలగిస్తూ కౌన్సిల్ సభ్యులంతా తీర్మానం చేశారని, అయినా అతనిని ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఇలా ఆయా వార్డు కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్


సిసి రోడ్డు సంకుస్థాపనలో పాల్గొన్న పిల్లి సూర్యప్రకాష్

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని తాళ్లపోడులో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఎంపి నిధుల నుంచి విడుదల చేసిన రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుమూల పల్లెల్లో రోడ్ల అభివృద్ధికి ఎంపి సుభాష్‌చంద్రబోస్ నిధులతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి, సర్పంచ్ చప్పిడి శ్రీనివాస్, నాయకులు పంపన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - మండపేట

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుందని, ప్రజలు ఆందోలన చెందవద్దని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవర్గానికి తుపాన్ ముప్పు పొంచి ఉందని, అయితే దానిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే తెలియచేసేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని, కపిలేశ్వరపురం మండల ప్రజలు 9381145177, మండపేట ప్రజలు 7989997185, రాయవరం ప్రజలు 9618006344, మండపేట పట్టణ ప్రజలు 9849906527 నెంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చునని అన్నారు.

వైద్య విద్య ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వైద్య విద్య ప్రవేటీకరణను రద్దు చేయాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో వానపల్లిపాలెం, మునిపల్లి గ్రామాల్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వైసిపి నాయకులు నల్లా నాయుడు, సలాది సతీష్, నల్లా సూర్యప్రకాష్, నల్లా ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ప్రభుత్వ హాస్పటల్ ఆవరణలోని పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద నూతనంగా నిర్మిస్తోన్న భవనంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. కనీసం గుర్తించలేని విధంగా పురుగులు పట్టి, కుళ్ళిపోయి ఉంది. ఇది హత్యా, ఆత్మహత్యా అనేది తెలియాల్సి ఉంది. హాస్పటల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- గోకవరం

మారణాయుధాలు చూపించి దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గుర్ని గోకవరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 6వ తేదీ రాత్రి కొత్తపల్లి రహదారిలోని జిమ్ సెంటర వద్ద దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రోడ్డు పక్కన ఆగి టాయిలెట్‌కి వెళ్తున్నాడు. ఈ సమయంలో అతని వద్దకు చిరునామా పేరుతో వెళ్లి చాకు చూపించి చంపేస్తామంటూ బెదిరించి సెల్ ఫోను, రూ.2 వేలు నగదు, స్కూటీ లాక్కొని పారి పోరన్నారన్నారు. దీంతో వారిపై నిఘా పెట్టామన్నారు. గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివమోహన్, తుమ్మల అరవిందలను అరెస్టు చేశామన్నారు. వీరు గ్రామ శివారులో మారణా యుధాలు చూపించి దాని దోపిడీకి పాల్పడుతున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

కాపవరంలో హైవేపై లారీ బోల్తా

ప్రజాశక్తి-కొవ్వూరు

కాపవరం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దేవరపల్లి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న బియ్యం లోడు లారీ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. లారీ డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

తమపై దాడి చేశారంటూ ఇనుగంటివారి పేటకు చెందిన ఇనుమర్తి జ్యోతి సోమవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 24న ఇనుగంటివారిపేటలో తన సోదరుడు వేమగిరి సూరిబాబు, సోదరి రజనీలను అదే గ్రామానికి చెందిన వీధి స్వామి, అతని కుమారులు నాని, అరుణ్, తమ్మిరిసి బాలు దౌర్జన్యంగా కొట్టారని జ్యోతి తెలిపింది. ఎస్‌సి కమ్యునిటీ హాల్ వద్దకు ఈడ్చుకెళ్లి రక్తపు గాయాలయ్యేలా కొట్టరన్నారు. తన సోదరుని కేకలు విని కాపాడ్డానికి వెళ్లానని పేర్కొంది. దీంతో వారు తనపై బూతులు తిడుతూ దాడికి దిగారని తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

గుల్లిపాడులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటనందూరు

తుని రైల్వే స్టేషన్ పరిధిలో గుల్లిపాడు స్టేషన్ సమీపంలో గుర్తుతెలియన ట్రాన్స్‌జెండర్ మరణించినట్లు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. మరణించిన వ్యక్తికి 30 ఏళ్ల వయసు ఉంటుందని, తెలిపారు. కుడి చేతిపై అమ్మ అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని ఉప్పంగలలో దుండగులు మహిళ మెడలో గొలుసు అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కార్తీక సోమవారం కావడంతో శివాలయానికి వెళుతున్న గ్రామానికి చెందిన కట్టా రామలక్ష్మి మెడలో బంగారు గొలుసును బైకుపై వచ్చిన ఇద్దరు ఆగంతుకులు లాక్కుని పరారయ్యారు. దీనిపై ఆమె కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రావులపాలెం

వెదిరేశ్వరంలో ఒక గృహంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అరెస్టు చేసినట్లు సిఐ శేఖర్‌బాబు తలెఇపారు. అలాగే స్థానిక బండిరేవుపుంత పబ్లిక్ స్థలంలో పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ చంటి తెలిపారు. వెధిరేశ్వరంలో రూ.25,070, బండిరేవుపుంతలో రూ.2,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పాదగయను దర్శించిన ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి-పిఠాపురం

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయను ముమ్మిడివరం ఎంఎల్ఎ ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పదో శక్తి పీఠం పురుహూతికా అమ్మవారిని, కుక్కుటేశ్వర స్వామివారిని, రాజరాజేశ్వరి అమ్మవారిని, దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు పాద గయ క్షేత్ర విశిష్టతను ఎంఎల్ఎ దంపతులకు వివరించారు. అనంతరం ఇఒ వారికి స్వామివారి శేషవస్త్రములు, చిత్రపటాలు,ప్రసాదములను అందజేశారు. ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లంరాజు చంద్రమౌళి, దేవస్థానం సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి దత్తాత్రేయ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు జుజ్జవరపు శ్రీనివాస్ చౌదరి సాయం అందించగా టిడిపి నేతలు హాజరై పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.

ప్రయివేటీకరణతోనే అభివృద్ధా.?

-పార్కుల నిర్వహణ ప్రయివేటుకి యత్నం
-ప్రవేశానికి ఛార్జీల వసూలు తప్పదు
-ఆహ్లాదానికి దూరం కానున్న సామన్యులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలోని ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కాకినాడ స్మార్ట్ సిటీలో పార్కుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఆదర్శమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ఇది జరుగుతున్నట్లు ప్రకటిస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్కులను ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా 9 పార్కులను తొలి దశ కింద గుర్తించారు. వివేకానంద పార్క్, బోట్ క్లబ్ పార్క్, అన్నాం ఘాటి పార్క్, సంత చెరువు పార్క్, జన్మభూమి పార్క్, సురేష్ నగర్ పార్క్, గాంధీనగర్ పార్క్, కెనాల్ బ్రాంచ్ పార్క్, అమరావతి పార్కులను వ్యాపార, పారిశ్రామక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు సామాజిక బాధ్యత కింద దత్తతు ఇచ్చేందుకు నగర పాలక సంస్థ సిద్ధంగా ఉంది. అయితే ప్రయివేటీకరణతోనే అభివృద్ధి జరుగుతుందా? అనే ప్రశ్న నగరవాసుల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికే నగరం స్మార్ట్ సిటీ నిధులతో పలు రంగాలను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో పార్కుల నిర్వహణ ప్రయివేటు సంస్థలకు అప్పగించే నిర్ణయంపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం, ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

నగరంలో సుమారు 5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం నగరం, నగరానికి అనుకుని ఉన్న ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువమంది పేదలు సామూహికంగా ఇరుకు ఇళ్లల్లో నివసిస్తారు. మధ్యతరగతి వర్గాలు అయితే అపార్టుమెంట్లలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సహజంగానే ఆహ్లాదకరంగా వాతావరణం కనిపిస్తుంది. పట్టణాల్లో అందుకు విరుద్ధంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆహ్లాదం కోసం పలువురు పార్కులను ఆశ్రయిస్తున్నారు. పట్టణాల్లో నివసిస్తున్న జనాభా వినోదం కోసం సినిమాలకు వెళుతుంటారు. అయితే సినిమా టికెట్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో పార్కులకు వెళ్లేందుకు ఇష్టపడుతుంటారు. పార్కులు చుట్టూ అనేకమంది చిరు వ్యాపారులు స్వయం ఉపాధి కోసం వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు వ్యక్తులకు పార్కుల నిర్వహణ భారం అప్పగిస్తే ఆటలు, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. ఆహ్లాదకరమైన పార్కులలో వీటిని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు నగరవాసుల నుంచి వినిపిస్తున్నాయి. ఆటల కోసం క్రీడాస్థలాలను అభివృద్ధి చేయాలి తప్ప ఇలా పార్కులలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే ఆహ్లాదం ఆవిరి అవడం ఖాయమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఫుడ్ కోసం ఈట్ స్ట్రీట్‌లు ఇప్పటికే ఉన్నాయి. అయితే వీటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రతిపాదనలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కుల్లో ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, ఫుడ్ కోర్టులు, నెట్ క్రికెట్, గో-కార్ట్ ట్రాక్స్, ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్, బంపర్ కార్స్ వంటి వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పార్కుల ప్రయివేటీకరణ సరికాదు

కాకినాడ నగరపాలక సంస్థ పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను అధికారులు ఉపసంహరించుకోవాలి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే వివిధ ఛార్జీలను పెద్ద మొత్తంలో వసూలు చేస్తారు. పబ్లిక్ స్థలాల్లో ప్రజలు సంచరించడానికి ఎటువంటి తారతమ్యాలకు తావుండరాదని భారత రాజ్యాంగం చెబుతోంది. ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని నగరపాలక సంస్థ నిధుల ద్వారా అన్ని పార్కులను అభివృద్ధి చేయాలి.

-పలివెల వీరబాబు, సిపిఎం నగర కన్వీనర్



ఆహ్లాదకరంగా కనిపిస్తున్న కాకినాడ వివేకానంద పార్క్

అభివృద్ధిలో వెనకబడిన పార్కులు

నగరంలో 24 పార్కులు ఉన్నాయి. అయితే అనేక పార్కులు నేటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వాటిలో కాలు కూడా మోపని పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులను మాత్రమే ప్రయివేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. అయితే అభివృద్ధిలో వెనుకబడిన పార్కులను ఎందుకు అప్పగించడం లేదనేది పలువురి వాదన. వివేకానంద పార్కు, గాంధీ నగర్, జన్మభూమి, బోట్ క్లబ్ పార్కులు కార్పొరేషన్ నిర్వహిస్తోంది. సెక్యూరిటీ, క్లీనింగ్, పారిశుధ్యం పనులను ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు నిర్వహిస్తున్నారు. మిగిలిన పార్కులను స్థానిక అసోసియేషన్లకు తక్కువ మొత్తంలో అంటే నెలకు రూ.6 వేలు ఇస్తూ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే చాలా పార్కులు పూర్తిస్థాయిలో నిర్వహణ లేక అభివృద్ధి కానరాక వెలవెలబోతున్నాయి. అయితే స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన వాటిని మాత్రమే ప్రయివేటు సంస్థలకు బాధ్యతలు అప్పగిస్తామనడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పౌరులు పార్కులలో సంచరించడానికి ఆటంకాలు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం అనే వాదనలు మరోవైపు వినిపిస్తున్నాయి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే పార్కులలో ప్రవేశానికి మొదలుకొని ఇతర అవసరాలకి పెద్ద మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తారు. ఫుడ్ కోర్టులను వెలుపల అనుమతిస్తే ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కులు వ్యర్థాలకు నిలయాలుగా మారతాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతంలో కుళాయి చెరువు పార్కులో వ్యవసాయ శాఖ ఫల పుష్ప ప్రదర్శన నిర్వహించేది. నగర ప్రజల కోరిక మేరకు దానిని తొలగించారు. అయితే పాలకవర్గం లేకుండా, ప్రజా ప్రతినిధుల వైఖరి తెలియజేయకుండా పార్కులను ఏ విధంగా ప్రయివేటు వ్యక్తులకు ఇస్తారనేది సిపిఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. జగన్నాథపురం ప్రాంతంలో సుమారు 1.50 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో అన్నమ్మ ట్యాంక్ అభివృద్ధి అరకొరగానే ఉంది. సామాన్యులు నివసించే ఇటువంటి చోట్ల పార్కులను అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురి సామాజిక వేత్తల అభిప్రాయం. అధికారుల పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను పక్కన పెట్టాలనే డిమాండ్ ముందుకొస్తుంది. కావున నగరంలో ఉన్న అన్ని పార్కులను నగరపాలక సంస్థ ద్వారా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం సర్వాత్ర వినిపిస్తోంది.

విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు


క్రేన్‌లతో సిద్ధంగా ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది

తుపాన్ ప్రభావంతో జరగరాని విపత్తు ఎదురైతే దానిని ఎదుర్కొనేందుకు విద్యుత్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. మండపేట ఎడిఇ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను అందుబాటులో ఉంచారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడైన విద్యుత్ సమస్యలు ఎదురైతే సమాచారాన్ని చేరవేసేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎడిఇ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. ఏదైనా సమస్య ఉత్పన్నం అయితే మండపేట టౌన్ 9440904519, ద్వారపూడి సెక్షన్‌లో 9440904527, ఆలమూరు సెక్షన్‌లో 9440904521, రాయవరం సెక్షన్‌లో 9493178873, ఏడిద సెక్షన్‌లో 9440904503 నెంబర్లకు తెలియ చేయాలని సూచించారు. తుపాను ప్రభావంతో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగినా, వైర్లు తెగిపడిన ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటువంటి పరిస్థితి ఏర్పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం చేరవేయాలని కోరారు.

సత్యనారాయణకు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం సూర్య విద్యాసంస్థల అధినేత కెవివి.సత్యనారాయణకు డాక్టర్ ఎబిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మాజీ ఎంఎల్‌సి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ ఏజెన్సీ ముఖ ద్వారమైన యర్రవరంలో తక్కువ ఫీజులకే పేద విద్యార్థులకు విద్యను అందించడమే కాక ఆయన నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగయ్య సత్యనారాయణను ప్రశంసించారు. ఎసత్యనారాయణకు అవార్డు లభించడం పట్ల సంఘం గౌరవాధ్యక్షుడు కెఎన్ఎల్.లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు కె.గోవిందరావు, ఎన్‌విఎస్.రఘు ప్రదీప్, రాజా రత్నకుమార్, కొండపల్లి విల్సన్ బాబు అభినందించారు.

81 మందికి గృహ రుణాల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో 1996 తుపాను తర్వాత ఆది ద్రావిడశాఖ ద్వారా ఎస్‌సి గ్రామాల్లో రూ.35 వేలతో నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.5 లక్షలు గృహ నిర్మాణ స్కీమ్ అమలు చేస్తూ దీపావళి అనంతరం ఆదేశాలు వచ్చాయి. ఆవిధంగా 61 మంది లబ్దిదారులకు మొదటి దఫా సొమ్ము ఒక్కొక్కరికీ రూ.2 లక్షల 50 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

తుపానుపై అధికారులతో ఆర్ఎఒ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను దూసుకొస్తున్న నేపథ్యంలో ఎన్‌డిఆర్ఎఫ్ రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య, పోలీస్, మున్సిపాలిటీ, వ్యవసాయ, పిడబ్ల్యుడి తదితర శాఖల అధికారులతో ఆర్ఎఒ అంకిత్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో యానాం ఆర్ఎఒగా పని చేసిన అమన్ శర్మను సైక్లోన్ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో సోమవారం అమన్‌శర్మ యానాం చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు. పునరావస కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

డిప్యూటీ తహాశీల్దారుగా జువ్వల బాలశ్రీ

ప్రజాశక్తి - యానాం

యానాం రెవెన్యూ శాఖ నూతన డిప్యూటీ తహాశీల్దార్‌గా జువ్వల బాలశ్రీని నియమిస్తూ పుదుచ్చేరి రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి కులోత్తుంగన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన జ్యోతి వెంకటేశ్వర్లును తూనికలు కొలతలు శాఖకు బదిలీ చేశారు.

జమీల్‌కు మాజీ సిఎం జగన్ పరామర్శ

ప్రజాశక్తి -రౌతులపూడి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారుడు జమీల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. మృతికి గల కారణాలను జమీల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వాసిరెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

భీమేశ్వరాలయంలో ఎంఎల్ఎ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కుటుంబంతోత కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంఎల్ఎకు చినరాజప్పకు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండల్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపిని నిలదీసిన మత్స్యకారులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సముద్రపు ఒడ్డున నివసిస్తున్న మత్స్యకారులకు ఇళ్ల స్థలాల కేటాయిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని మత్స్యకారులు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాసును నిలదీశారు. సోమవారం ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీకి చేదు అనుభవం ఎదురయ్యింది. మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఎంపీ సూచిస్తున్న తరుణంలో కొంతమంది మత్స్యకారులు ఎంపీ ఉదయ శ్రీనివాసుని నిలదీశారు. కొన్ని సంవత్సరాలుగా ఉప్పాడ అలల తాకిడికి గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని, తుపానుల సమయంలో మాత్రం అధికారులు, నాయకులు హడావిడి చేసి వెళ్ళిపోతున్నారు తప్ప మత్స్యకారులను పట్టించుకోవడం లేదన్నారు. తమ స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని ప్రశ్నించారు. పునరావాస కేంద్రాలకు వెళ్ళేది లేదని, తమకు తుపానులు అలవాటే అని ఎంపీకి తెలిపారు.

భవన కార్మికుల సభ పోస్టర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి-ప్రత్తిపాడు

భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని భవన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు పిలుపు ఇచ్చారు. స్థానిక బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడారు. 2వ మహాసభలు జగ్గంపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 31న జగ్గంపేట సెంటర్లో కార్మికుల సమస్యలపై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని, నవంబర్ 1న జగ్గంపేటలో గోకవరం రోడ్డులోని కాపు కల్యాణ్ మండపంలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు శీరం సత్తిబాబు, పి.శ్రీను, పి.దేవుళ్ళు, అమరాది దొరబాబు, బూదిన సత్తిబాబు పాల్గొన్నారు.

కాలినడకన వచ్చే వారికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే యాత్రికుల దర్శనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ ముదునూరు వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్‌రావు అన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు, నెలమూరు గ్రామాల నుంచి 250 మంది యాత్రికులు ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి వాడపల్లి వెంకన్న ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



దీక్షను కొనసాగిస్తున్న రవికుమార్

కొనసాగిన రవికుమార్ దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టాండ్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవికుమార్ చేపట్టిన రిలే దీక్ష సోమవారం వర్షంలోనూ కొనసాగింది. స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న రిలే దీక్ష సోమవారం 17 రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పొట్టిలంకకు చెందిన పోతుల భారతి, హేమ సుందరనారాయణరావు సంఘీభావం తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తపేట

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు, కూటమి నాయకులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ముంపు భారిన పడిన బాధితులకు జనసేన కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో కొత్తపేట రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూం 08855-244299, 85002-38258 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - రామచంద్రపురం


ఆలయ కాంప్లెక్స్‌లో యాత్రికులు

ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి సోమవారం యాత్రికులు పోటెత్తారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆలయానికి యాత్రికులు పెద్దఎత్తున చేరుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ యాత్రికులతో కిటకిటలాడాయి. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

యాత్రికునికి అస్వస్థత

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జనార్ధన స్వామి ఆలయానికి వచ్చిన యాత్రికుడు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన ఆలయ అర్చకులు అంగర సాయి భగవాన్ ఆచార్యులు ప్రాథమిక వైద్యాన్ని అందజేశారు. దీంతో యాత్రికుడు కోలుకున్నాడు. తక్షణమే స్పందించి వైద్యాన్ని అందించిన అర్చకుడిని ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, గ్రామస్తులు అభినందించారు.